కలం
ప్రజల గళం...
kalamdaily.com
Follow on: Kalamtelugu
శనివారం ● 02-05-2026
పేజీలు: 5



SINGLE TOPIC
టెంపుల్ టూరిజం



# మన గుడులు.. మన సంస్కృతి




ఏఐ ఇమేజ్

**పర్యాటక కేంద్రాలుగా పుణ్యక్షేత్రాలు.. మానసిక ప్రశాంతతకు నిలయాలు**
**టూరిజం హబ్ దిశగా రాష్ట్రం అడుగులు.. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సాకారం**

సమ్మర్ హాలిడేస్ వచ్చాయంటే దైవ దర్శనం కోసమో.. మానసిక ప్రశాంతత కోసమో.. తిరుపతి వేంకటేశ్వరుడిని, శ్రీశైలం మల్లికార్జునుడిని లేదా తమిళనాడులోని అరుణాచలేశ్వరుడిని దర్శించుకుంటాం. వందల కిలోమీటర్లు ప్రయాణించి పొరుగు రాష్ట్రాల్లోని క్షేత్రాలకు వెళ్తుంటాం. మన తెలంగాణలో భక్తి పారవశ్యానికి, శిల్పకళా వైభవానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే అపురూపమైన ఆలయాలు ఎన్నో ఉన్నాయి. దక్షిణ కాశీగా పేరొందిన వేములవాడ రాజన్న మొదలుకొని, ఆధునిక శిల్పకళా అద్భుతం యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వరకు.. ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప నుంచి కోటి లింగాల వరకు.. ప్రతి అడుగులోనూ జీవకళ ఉట్టిపడేలా తెలంగాణలో ఆలయాలు ఉన్నాయి.

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలు.. ఇప్పుడు సరికొత్త హంగులతో పర్యాటక కేంద్రాలుగా మారుతున్నాయి. శతాబ్దాల చరిత్ర కలిగిన రామప్ప, భద్రాచలం, అలంపూర్ జోగులాంబ క్షేత్రాలను అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రసాద్' పథకం కింద సుమారు రూ.146 కోట్లకు పైగా నిధులు కేటాయించింది. ఈ నిధులతో భక్తులకు అవసరమైన వసతి, రవాణా, ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నది. అలంపూర్, రామప్ప ఆలయాల్లో పనులు వేగంగా జరుగుతుండగా, ఇటీవల బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని కూడా ఈ జాబితాలో చేర్చడం విశేషం. మరోవైపు, రాష్ట్ర ప్రభుత్వం కూడా తెలంగాణను టూరిజం హబ్‌గా మార్చేందుకు కసరత్తు చేస్తున్నది. కేవలం ఆలయ దర్శనాలే కాకుండా, పర్యాటకులు అక్కడ ఎక్కువ సమయం గడిపేలా సోమశిల, వరంగల్ వంటి ప్రాంతాల్లో ప్రైవేట్ భాగస్వామ్యంతో త్రీ స్టార్, ఫైవ్ స్టార్ హోటళ్లను నిర్మించాలని ప్లాన్ చేస్తున్నది. ఆధ్యాత్మికతకు ప్రకృతి అందాలను జోడించి, పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. తెలంగాణలోని ఆధ్యాత్మిక కేంద్రాలేంటి? వాటి విశిష్టత ఏంటి? సందర్శనీయ స్థలాలేంటి? సాంస్కృతి సంపద కలిగిన క్షేత్రాలేవీ?.. వీటన్నింటిపై కలం స్పెషల్..

- కలం, సెంట్రల్ డెస్క్



# అద్భుత కట్టడం.. రామప్ప

వేల ఏండ్లు గడిచినా చెక్కుచెదరని శిల్పకళా సౌందర్యం.. నీటిపై తేలే ఇటుకల వింత.. భూకంపాలను సైతం తట్టుకునే అద్భుత సాంకేతికత.. రామప్ప ఆలయ సొంతం.

**ఎక్కడ ఉంది:** ఈ చారిత్రక ఆలయం ములుగు జిల్లా, వెంకటాపురం మండలంలోని పాలంపేట గ్రామంలో ఉంది.

**ప్రత్యేకత:** రామప్ప ఆలయం కేవలం ఒక ప్రార్థనా మందిరం మాత్రమే కాదు, అదొక ఇంజనీరింగ్ అద్భుతం. ఆలయ శిఖర నిర్మాణం కోసం ఉపయోగించిన ఇటుకలు నీటిపై తేలుతాయి. పునాదుల్లో భారీగా ఇసుకను నింపి నిర్మించారు. అందుకే ఎంత పెద్ద భూకంపం వచ్చినా.. పక్కన ఉన్న చిన్న కట్టడాలు కూలినా.. ప్రధాన ఆలయం చెక్కుచెదరలేదు.

**చరిత్ర:** కాకతీయ చక్రవర్తి గణపతి దేవుని కాలంలో.. ఆయన ప్రధాన సేనాని రేచర్ల రుద్రుడు క్రీ.శ. 1213లో రామప్ప ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయ ప్రధాన దైవం రామలింగేశ్వరుడు (శివుడు). ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన ప్రధాన శిల్పి రామప్ప గౌరవార్థం ఈ టెంపుల్‌కు ఆయన పేరే స్థిరపడిపోయింది.

**ఎలా వెళ్లాలి:** హైదరాబాద్ నుంచి వరంగల్ లేదా హన్మకొండకు చేరుకుని.. అక్కడ నుంచి ములుగు మీదుగా పాలంపేటకు బస్సు లేదా కారులో వెళ్లొచ్చు. వరంగల్ లేదా కాజీపేట స్టేషన్‌లో దిగి 70 కి.మీ. ప్రయాణించి ఆలయానికి చేరుకోవచ్చు.



# అష్టాదశ శక్తి పీఠాల్లో ఒకటి అలంపూర్ జోగులాంబ

తుంగభద్రా నదీ తీరాన వెలసిన ఆధ్యాత్మిక చైతన్యం.. అష్టాదశ శక్తి పీఠాలలో ఐదోదిగా విరాజిల్లుతున్న పుణ్యక్షేత్రం.. అలంపూర్ జోగులాంబ ఆలయం. బాదామి చాళుక్యుల అద్భుత వాస్తుకళకు ప్రతిరూపమైన నవబ్రహ్మ ఆలయాల సముదాయంతో, భక్తిని.. చారిత్రక వైభవాన్ని ఏకకాలంలో పంచే ఈ క్షేత్రం తెలంగాణ పర్యాటక రంగంలో ఒక మణిహారం.

**ఎక్కడ ఉంది:** జోగులాంబ గద్వాల జిల్లా.. అలంపూర్ పట్టణంలో ఉంది. ఇది తుంగభద్ర, కృష్ణా నదుల సంగమ ప్రాంతానికి సమీపంలో ఉంటుంది.

**ప్రత్యేకత ఏంటి:** సతీదేవి దంతం పడిన ప్రాంతంగా భావించే ఈ క్షేత్రం.. 18 ప్రధాన శక్తి పీఠాల్లో ఐదోవది. ఇక్కడ అమ్మవారు జోగులాంబ (యోగుల అంబ)గా కొలువై ఉన్నారు. వారణాసిలాగే ఇక్కడా క్షేత్ర పాలకుడిగా మల్లికార్జున స్వామి ఉండటంతో దీనిని దక్షిణ కాశీ అని పిలుస్తారు.

**చరిత్ర:** ఈ ఆలయ సముదాయాన్ని క్రీ.శ. 7వ – 8వ శతాబ్దాల మధ్య బాదామి చాళుక్యులు నిర్మించారు. 14వ శతాబ్దంలో బహుమనీ సుల్తానుల దాడిలో ప్రధాన ఆలయం ధ్వంసమైంది. అప్పట్లో భక్తులు అమ్మవారి విగ్రహాన్ని సమీపంలోని బాల బ్రహ్మేశ్వర ఆలయంలో దాచి ఉంచారు. దాదాపు 600 ఏండ్ల తర్వాత, 2005లో అమ్మవారికి కొత్త ఆలయం కట్టి ప్రతిష్ఠించారు.

**ఎలా వెళ్లాలి:** హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళ్లేటప్పుడు అలంపూర్ క్రాస్ రోడ్ చేరుకోవచ్చు. అక్కడి నుంచి ఆలయానికి ఆటోలు, బస్సులు అందుబాటులో ఉంటాయి. అలంపూర్ రోడ్ రైల్వే స్టేషన్ (సికింద్రాబాద్ – కర్నూలు మార్గం) అందుబాటులో ఉంది. కర్నూలు స్టేషన్ నుంచి చేరుకోవడం ఈజీ.



# దక్షిణ అయోధ్యగా.. భద్రాచలం రామాలయం

గోదావరి తీరాన భక్త రామదాసు కీర్తనల మధ్య పరవశించే ఆధ్యాత్మిక ధామం.. రాముడు తన వనవాస కాలంలో సీతమ్మతో కలిసి నడిచిన పవిత్ర నేల భద్రాచలం. రామభక్తుడు కంచర్ల గోపన్న అపార భక్తికి, త్యాగానికి నిలువుటద్దంగా నిలిచిన ఈ క్షేత్రం.. కేవలం ఒక ఆలయం మాత్రమే కాదు.. తెలుగు సంస్కృతి, సంప్రదాయాల సమ్మేళనం.

**ఎక్కడ ఉంది:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పవిత్ర గోదావరి నది తీరాన ఉంది. ఇది ఖమ్మం నుంచి సుమారు 120 కి.మీ., హైదరాబాద్ నుంచి 310 కి.మీ.దూరంలో ఉంది.

**ప్రత్యేకత:** ఇక్కడ రాముడు నాలుగు చేతులతో, శంఖు చక్రాలు ధరించి ఉంటాడు. ధనుర్బాణాలు ధరించిన రాముడు ఒక చేతిలో శంఖం, మరో చేతిలో చక్రం ఉండటం విశేషం. సాధారణంగా రాముడు పక్కన సీతమ్మ ఉంటుంది. కానీ, ఇక్కడ స్వామివారి ఎడమ తొడపై సీతమ్మ కూర్చుని దర్శనమిస్తారు.

**చరిత్ర:** మేరు పర్వత కుమారుడైన భద్రుడు రాముడి కోసం తపస్సు చేశాడని, అందుకే ఈ ప్రాంతానికి భద్రాచలం (భద్రుని కొండ) అనే పేరు వచ్చిందని పురాణ గాథ. 17వ శతాబ్దంలో తహశీల్దార్‌గా ఉన్న కంచర్ల గోపన్న, ప్రభుత్వ సొమ్ముతో ఈ ఆలయాన్ని నిర్మించారు. గోల్కొండ నవాబు తానీషా ఆగ్రహానికి గురై 12 ఏండ్లు చెరసాలలో బందీ అయ్యారు. రామదాసు భక్తికి మెచ్చిన రాముడు, లక్ష్మణుడు స్వయంగా వెళ్లి రామ టంకల రూపంలో తానీషాకు బకాయి చెల్లించి రామదాసును విడిపించారని చెప్తుంటారు.

**ఎలా వెళ్లాలి:** హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, విజయవాడ నుంచి భద్రాచలానికి డైరెక్ట్ బస్సులు, ప్రైవేట్ వాహనాలు ఉంటాయి. భద్రాచలానికి డైరెక్ట్ రైలు లేదు. భద్రాచలం రోడ్ (కొత్తగూడెం)లో దిగి 40 కి.మీ. బస్సులో ప్రయాణించి ఆలయానికి చేరుకోవచ్చు.





# తెలంగాణ తిరుపతి.. యాదాద్రి

ఆధ్యాత్మికతకు అద్దం పట్టే అపురూప శిల్పకళా వైభవం.. కృష్ణశిలలతో రూపుదిద్దుకున్న ఆధునిక ఆలయ అద్భుతం యాదాద్రి. పంచ నారసింహులు కొలువైన ఈ దివ్యక్షేత్రం.. పునర్నిర్మాణం తర్వాత ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతోంది. అటు భక్తిని, ఇటు అద్భుతమైన ఇంజనీరింగ్ నైపుణ్యాన్ని మేళవించిన ఈ పుణ్యధామం తెలంగాణ గర్వకారణం.

**ఎక్కడ ఉంది:** యాదాద్రి ఆలయం యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టపై ఉంది. ఇది హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం విశేషం.

**ప్రత్యేకత:** కృష్ణశిలలతో పునర్ నిర్మించిన అరుదైన ఆలయం. 2.5 లక్షల టన్నుల నల్లరాయిని ఉపయోగించారు. ఇక్కడ స్వామివారు జ్వాల నరసింహ, గండభేరుండ నరసింహ, యోగానంద నరసింహ, ఉగ్ర నరసింహ, లక్ష్మీ నరసింహ అనే ఐదు రూపాల్లో (పంచ నారసింహులుగా) భక్తులకు దర్శనమిస్తారు.

**చరిత్ర:** రుష్యశృంగ మహర్షి కుమారుడైన యాదమహర్షి ఇక్కడ నరసింహ స్వామి కోసం ఘోర తపస్సు చేశాడు. ఆయన భక్తికి మెచ్చిన స్వామివారు పంచ రూపాల్లో ప్రత్యక్షమయ్యారని, అందుకే ఈ కొండకు యాదగిరి (యాదగిరిగుట్ట) అనే పేరు వచ్చిందని పురాణాలు చెబుతున్నాయి.

**ఎలా వెళ్లాలి:** హైదరాబాద్ (ఉప్పల్, జేబీఎస్) నుంచి యాదగిరిగుట్టకు ప్రతి 15 నిమిషాలకు ఒక ఆర్టీసీ బస్సు ఉంటుంది. దగ్గరలో ఉన్న రైల్వే స్టేషన్ రాయగిరి (యాదాద్రి).



# దక్షిణ కాశీగా ఎములాడ రాజన్న

భక్తుల పాలిట కొంగుబంగారం.. కులమతాలకు అతీతంగా గంగ-జమున తెహజీబ్‌కు నిలువుటద్దం వేములవాడ రాజన్న క్షేత్రం. కోడె మొక్కుల కొలువుగా.. హరిహర క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన ఈ ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. వేములవాడ చాళుక్యుల శిల్పకళా వైభవానికి, భక్త మార్కండేయుని తపఃఫలానికి ఈ క్షేత్రం ఒక సజీవ సాక్ష్యం.

**ఎక్కడ ఉంది:** రాజరాజేశ్వర స్వామి దేవాలయం రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలో ఉంది.



**ప్రత్యేకత:** ఆలయంలో అత్యంత విశిష్టమైన మొక్కు కోడె మొక్కు. భక్తులు గిత్త (ఎద్దు)ను ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయించి స్వామివారికి సమర్పిస్తారు. ఇలా చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని.. కోరిన కోరికలు నెరవేరుతాయని నమ్మకం. ఒకే ప్రాకారంలో శివుడు (రాజరాజేశ్వరుడు), విష్ణువు (అనంత పద్మనాభ స్వామి) కొలువై ఉండటం ఇక్కడి ప్రత్యేకత. అందుకే దీనిని హరిహర క్షేత్రం అంటారు.

**చరిత్ర:** ఈ ఆలయాన్ని క్రీ.శ. 750 – 973 మధ్య వేములవాడ చాళుక్యులు నిర్మించారు. ముఖ్యంగా రాజాదిత్యుని మనవడైన రాజరాజ నరేంద్రుడు ఈ ఆలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని చరిత్ర చెబుతోంది. భావన రుషి కుమారుడైన మార్కండేయుడు తన మృత్యువును జయించడానికి ఇక్కడ శివుడి కోసం తపస్సు చేశాడని, శివుడు ప్రత్యక్షమై అతడిని ఆశీర్వదించాడని పురాణాలు చెబుతున్నాయి.

**ఎలా వెళ్లాలి:** ఎంజీబీఎస్, జేబీఎస్ నుంచి వేములవాడకు ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. కరీంనగర్, సిరిసిల్ల, వరంగల్ నుంచి కూడా బస్సులు ఉంటాయి.



# శక్తి స్వరూపిణి బల్కంపేట రేణుకా ఎల్లమ్మ

నమ్మిన భక్తుల పాలిట కల్పవల్లి.. కష్టాలను కడతేర్చే చల్లని తల్లి బల్కంపేట రేణుకా ఎల్లమ్మ. భూగర్భంలో వెలిసిన స్వయంభూ మూర్తిగా... జలపాతాల మధ్య కొలువుదీరిన ఆదిశక్తిగా ఈ ఆలయం ప్రసిద్ధి. ఏటా జరిగే అమ్మవారి కళ్యాణోత్సవం, బోనాల పండుగ వేళ బల్కంపేట వీధులన్నీ భక్తులతో కిక్కిరిసిపోతాయి.

**ఎక్కడ ఉంది:** ఈ ఆలయం హైదరాబాద్లోని బల్కంపేట ప్రాంతంలో ఉంది. అమీర్‌పేట నుంచి కేవలం 2 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

**ప్రత్యేకత:** అమ్మవారి విగ్రహం భూమట్టానికి సుమారు 10 అడుగుల లోతులో ఉంటుంది. భక్తులు మెట్లు దిగి వెళ్లి అమ్మవారిని దర్శించుకోవాలి. అమ్మవారి విగ్రహం వెనుక భాగంలో నిరంతరం నీరు ఊరుతూ ఉంటుంది. ఈ నీటిని అత్యంత పవిత్రమైనదిగా, సర్వ రోగ నివారిణిగా భక్తులు విశ్వసిస్తారు. దీనిని తీర్థంగా స్వీకరిస్తారు. ఏటా ఆషాఢ మాసంలో వచ్చే తొలి మంగళవారం అమ్మవారికి నిర్వహించే కళ్యాణోత్సవం రాష్ట్ర పండుగలా జరుగుతుంది.

**చరిత్ర:** క్రీ.శ.15వ శతాబ్దంలో ఈ ప్రాంతం ఒక పొలంగా ఉండేదని, అక్కడ బావి తవ్వుతుండగా అమ్మవారి విగ్రహం బయటపడిందని చరిత్ర చెబుతున్నది. రేణుకా దేవి జమదగ్ని మహర్షి భార్య, పరశురాముని తల్లి. పతివ్రతా శిరోమణి అయిన రేణుకా దేవి, కొన్ని కారణాలతో భర్త ఆగ్రహానికి గురైందని, తర్వాత ఆమె శక్తి స్వరూపిణిగా ఎల్లమ్మగా వెలిసిందని పురాణాలు వివరిస్తున్నాయి.

**ఎలా వెళ్లాలి:** సమీప మెట్రో స్టేషన్ అమీర్‌పేట లేదా ఎస్ఆర్ నగర్. ఇక్కడి నుంచి ఆటో లేదా క్యాబ్ ద్వారా 5-10 నిమిషాల్లో ఆలయానికి చేరుకోవచ్చు. ఆర్టీసీ సిటీ బస్సులు అమీర్‌పేట, మైత్రీవనం మీదుగా వెళ్తుంటాయి.



# శిల్పకళా వైభవం.. వేయి స్తంభాల గుడి

అద్భుతమైన శిల్పకళా వైభవం.. ఓరుగల్లు సామ్రాజ్య వైభోగానికి సజీవ సాక్ష్యం వేయి స్తంభాల గుడి. నక్షత్రాకార పునాదిపై, వేయి స్తంభాల ఆధారంగా నిర్మితమైన ఈ చారిత్రక కట్టడం, కాకతీయుల ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిలువుటద్దం.

**ఎక్కడ ఉంది:** హన్మకొండ నగర నడిబొడ్డున ఉంది.

**ప్రత్యేకత:** ఈ ఆలయం ఒక ఎత్తైన వేదికపై నక్షత్రాకారంలో నిర్మించబడింది. దీనివల్ల ఏ వైపు నుంచి చూసినా ఆలయం అద్భుతంగా కనిపిస్తుంది. ఇది 3 ప్రధాన గర్భాలయాల సమ్మేళనం. ఇందులో శివుడు (రుద్రేశ్వరుడు), విష్ణువు (వాసుదేవుడు), సూర్య భగవానుడు కొలువై ఉన్నారు.

**చరిత్ర:** క్రీ.శ. 1163లో కాకతీయ చక్రవర్తి రుద్రదేవుడు ఈ ఆలయాన్ని నిర్మించారు. బాదామి చాళుక్యుల శైలి, కాకతీయుల సొంత వాస్తు కళా శైలి మేళవింపుతో ఈ నిర్మాణం సాగింది.

**ఎలా వెళ్లాలి:** హైదరాబాద్ నుంచి వరంగల్/హన్మకొండకు ప్రతి 15 నిమిషాలకు ఒక ఆర్టీసీ బస్సు అందుబాటులో ఉంటాయి. హైదరాబాద్ నుంచి సుమారు 3 గంటల ప్రయాణం. కాజీపేట లేదా వరంగల్ రైల్వే స్టేషన్లలో దిగాలి. అక్కడి నుంచి సిటీ బస్సులు లేదా ఆటోల ద్వారా 15–20 నిమిషాల్లో ఆలయానికి చేరుకోవచ్చు.

# కృష్ణానదీ తీరాన సోమశిల

కృష్ణమ్మ పరవళ్లు.. చుట్టూ కొండలు.. నదీ తీరాన కొలువుదీరిన ప్రాచీన శివాలయం.. ఇదీ సోమశిల ప్రత్యేకత. మినీ మాల్దీవులుగా పిలుస్తారు. ఆధ్యాత్మికతతో పాటు ఆహ్లాదాన్ని పంచే అద్భుత పర్యాటక క్షేత్రం. అటు మల్లికార్జునుడి దర్శనం, ఇటు రివర్ టూరిజం కలబోసిన ఈ క్షేత్రం వీకెండ్ డెస్టినేషన్‌గా సరికొత్త వైభవాన్ని సంతరించుకుంది.

**ఎక్కడ ఉంది:** సోమశిల పుణ్యక్షేత్రం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలో ఉంది. ఇది కృష్ణా నది తీరాన, శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ఒడ్డున కొలువుదీరి ఉంది.

**ప్రత్యేకత:** 12 జ్యోతిర్లింగాలకు ప్రతీకగా ఆలయాలు. ఇక్కడ కొలువై ఉన్న 15 ప్రాచీన శివాలయాల సమూహం ప్రధాన ఆకర్షణ. శ్రీశైలం ప్రాజెక్ట్ నిండినప్పుడు సంగమేశ్వర ఆలయం నీట మునుగుతుంది. నీరు తగ్గినప్పుడే ఆలయ దర్శనం లభిస్తుంది. కృష్ణా నది నీటి మధ్యలో నిర్మించిన కాటేజీలు, బోటింగ్ సౌకర్యంతో మినీ మాల్దీవులుగా పిలుచుకుంటారు.

**చరిత్ర:** సోమశిల ఆలయాలకు సుమారు 7వ శతాబ్దం నాటి చరిత్ర ఉంది. ఇవి బాదామి చాళుక్యుల కాలంలో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. స్కంద పురాణం ప్రకారం..ఇక్కడ సోమేశ్వర స్వామిని దర్శించుకుంటే సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం.

**ఎలా వెళ్లాలి:** ఎంజీబీఎస్ నుంచి కొల్లాపూర్‌కు బస్సులో వెళ్లాలి. అక్కడి నుంచి ఆటో లేదా ప్రైవేట్ వాహనాల ద్వారా 15 నిమిషాల్లో సోమశిలకు చేరుకోవచ్చు. ఇక్కడి నుంచి శ్రీశైలానికి వెళ్లేందుకు పర్యాటక శాఖ బోట్ సర్వీసులు కూడా అందుబాటులో ఉంచింది. నల్లమల అడవుల మధ్య నుంచి వెళ్తాం.



# అపరశక్తి స్వరూపం భద్రకాళి

పవిత్ర భద్రకాళి సరస్సు తీరాన కొలువుదీరిన అపరశక్తి స్వరూపం.. భద్రకాళి అమ్మవారు. కాకతీయ చక్రవర్తులు యుద్ధానికి వెళ్లే ముందు విజయం కోసం ప్రార్థించిన ఈ క్షేత్రం, నేడు భక్తుల పాలిట ఆధ్యాత్మిక ధామం.

**ఎక్కడ ఉంది:** హన్మకొండ, వరంగల్ మధ్య ఒక చిన్న కొండపై, భద్రకాళి సరస్సు ఒడ్డున ఉంది.

**ప్రత్యేకత:** ఇక్కడ అమ్మవారు 8 చేతులతో, వివిధ ఆయుధాలను ధరించి, పద్మాసనంలో కూర్చుని ఉన్న పెద్ద విగ్రహం (సుమారు 9 అడుగుల ఎత్తు) భక్తులకు దర్శనమిస్తుంది. శాంత స్వరూపిణిగా ప్రసన్న భద్రకాళిగా అమ్మవారు ఇక్కడ కొలువై ఉండటం విశేషం.

**చరిత్ర:** క్రీ.శ. 625 ప్రాంతంలో చళుక్య రాజైన రెండో పులకేశి కాలంలో నిర్మించారని చరిత్ర చెప్తున్నది. వేంగీ చాళుక్యులపై విజయం సాధించిన గుర్తుగా ఆయన ఈ ఆలయాన్ని నిర్మించారు.

**ఎలా వెళ్లాలి:** హైదరాబాద్ నుంచి హన్మకొండకు ఆర్టీసీ బస్సులు ఉంటాయి. హన్మకొండ బస్టాండ్ లేదా వరంగల్ బస్టాండ్ నుంచి ఆటోలు దొరుకుతాయి.



# 'ప్రసాద్' స్కీం కింద 4 ఆలయాలు

దేశంలోని ఆధ్యాత్మిక, వారసత్వ ప్రదేశాలను అన్నివిధాలుగా అభివృద్ధి చేసి.. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా.. 'ప్రసాద్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది. ఈ పథకం కింద రామప్ప, అలంపూర్ జోగులాంబ, భద్రాచలం శ్రీరాముడి ఆలయం, బల్కంపేట రేణుకా ఎలమ్మ ఆలయాలను డెవలప్ చేస్తున్నది. ఈ మేరకు కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ 2026, ఫిబ్రవరి 5న రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ప్రసాద్ స్కీమ్‌పై లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. ప్రసాద్ పథకం కింద నాలుగు ఆలయాలకు రూ.146.50 కోట్లు విడుదల చేసినట్లు ప్రకటించారు.

- అలంపూర్ జోగులాంబ ఆలయాన్ని 2020 - 21లో ప్రసాద్ స్కీం కింద కేంద్రం ఎంపిక చేసింది. రూ.38.90 కోట్లు మంజూరు చేయగా.. రూ.33.07 కోట్లు రిలీజ్ చేసింది. దాదాపు పనులు పూర్తి కావచ్చాయి.
- రామప్పను 2022 - 23లో ప్రసాద్ స్కీం కింద తీసుకురాగా.. అభివృద్ధి పనులకు రూ.62 కోట్లు కేటాయించింది. ఇప్పటి వరకు రూ.32.73 కోట్లు రిలీజ్ చేసింది. పనులు కొనసాగుతున్నాయి.
- భద్రాచలం శ్రీరాముడి ఆలయాన్ని 2022–23లో ప్రసాద్ స్కీమ్ కింద ఎంపిక చేసింది. రూ.41.38 కోట్లు మంజూరు చేయగా.. ఇప్పటి వరకు రూ.8.43 కోట్లు మాత్రమే రిలీజ్ చేసింది. పనులు చాలా మెల్లిగా కొనసాగుతున్నాయి.
- బల్కంపేట రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని 2024–25లో ప్రసాద్ స్కీమ్ కిందికి తీసుకొచ్చింది. రూ.4.22 కోట్లు మంజూరు చేయగా.. ఇప్పటి వరకు నిధులు రిలీజ్ చేయలేదు.

# పర్యాటక ప్రాంతాల్లో 5 స్టార్ హోటళ్లు

తెలంగాణ టూరిజం సెక్టార్‌కు దేశంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నది. రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలు, పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నది. రాష్ట్రంలోని వారసత్వ సంపద, సంస్కృతి, అద్భుతమైన కట్టడాలు, జల వనరులు, దట్టమైన అడవులు, ఆధ్యాత్మిక కేంద్రాలను సమన్వయం చేస్తూ రాష్ట్రాన్ని ఒక టూరిజం హబ్‌గా మార్చడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా అన్ని వసతులు కల్పించాలనేది రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన. ఇటీవల మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అడ్వైజర్ కమిటీ సభ్యులు కీలక సూచనలు చేశారు. సోమశిల, రామప్ప, వరంగల్ వేయి స్తంభాల గుడి, యాదాద్రి, గోల్కొండ, తారామతి బరాదరి, నాగార్జున సాగర్ వంటి కీలక పర్యాటక ప్రాంతాల్లో అభివృద్ధి పనులపై సమీక్ష చేశారు. వరంగల్, సోమశిల వంటి ప్రాంతాల్లో ప్రైవేట్ భాగస్వామ్యంతో 3 నుంచి 5 స్టార్ హోటళ్లు నిర్మించాలని సర్కార్ భావిస్తున్నది.



# అక్షరాభ్యాసానికి నిలయం బాసర

గోదావరి నదీ తీరాన వెలసిన అక్షర ధామం.. ముగ్గురు అమ్మల మూలపుటమ్మగా సరస్వతి దేవి కొలువుదీరిన జ్ఞాన క్షేత్రం బాసర. వ్యాస మహర్షి తపఃఫలంతో ఆవిర్భవించిన ఈ పుణ్యభూమి, వేలమంది చిన్నారులకు అక్షర భిక్ష పెట్టే చదువుల తల్లి చెంతకు చేరుస్తోంది.

**ఎక్కడ ఉంది:** నిర్మల్ జిల్లా ముధోల్ నియోజకవర్గంలోని బాసర గ్రామంలో ఉంది.

**ప్రత్యేకత:** తమ పిల్లలకు విద్య ప్రారంభించే ముందు ఇక్కడ అక్షరాభ్యాసం చేయించడం పవిత్రంగా భక్తులు భావిస్తారు. ఇక్కడ సరస్వతి దేవి విగ్రహంతో పాటు మహాలక్ష్మి, మహాకాళి విగ్రహాలు పక్కపక్కనే ఉంటాయి. అందుకే త్రిశక్తి క్షేత్రం అంటారు.

**చరిత్ర:** కురుక్షేత్ర యుద్ధం తర్వాత మనశ్శాంతి కోసం వ్యాస మహర్షి తన శిష్యులతో కలిసి దండకారణ్య యాత్రకు వచ్చి.. ఇక్కడి గోదావరి తీరాన నివసించారు. ప్రతిరోజూ నది నుంచి పిడికెడు ఇసుకను తీసుకువచ్చి 3 కుప్పలుగా పోసి అమ్మవార్లను (సరస్వతి, లక్ష్మి, కాళి) ఆరాధించారని ప్రతీతి.

**ఎలా వెళ్లాలి:** హైదరాబాద్ నుంచి డైరెక్ట్ బస్సులు ఉన్నాయి. సికింద్రాబాద్ నుంచి బాసరకు రైల్లో వెళ్లొచ్చు.



# అద్భుత నిర్మాణం.. డిచ్‌పల్లి రామాలయం


కాకతీయుల కాలపు శిల్పకళా వైభవానికి ప్రతీకగా నిలిచే రామాలయం.. పర్యాటకులకు కేవలం ఆధ్యాత్మికతనే కాదు, అద్భుతమైన నిర్మాణ చమత్కారాన్ని కూడా పరిచయం చేస్తుంది. వర్షాకాలంలో ఈ ఆలయం చుట్టూ నీరు చేరుతుంది. ఆ సమయంలో ఆలయం ఒక చిన్న ద్వీపంలా కనిపిస్తూ పర్యాటకులను కట్టిపడేస్తుంది.

**ఎక్కడ ఉంది:** నిజామాబాద్ జిల్లా, డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఉంది.

**ప్రత్యేకత:** ఈ ఆలయాన్ని నలుపు, తెలుపు గ్రానైట్ రాళ్లతో నిర్మించారు. ఖజురహో ఆలయాలను పోలి ఉండే ఇక్కడి శిల్పకళ వల్ల దీనికి ఆ పేరు వచ్చింది. ఆలయ గోడలు, స్తంభాలు, పైకప్పులపై దేవతా మూర్తులు, జంతువులు, సంగీత వాయిద్యకారులు, శిల్పాలు నైపుణ్యంతో చెక్కబడ్డాయి.

**చరిత్ర:** ఈ ఆలయాన్ని 14వ శతాబ్దంలో కాకతీయ రాజుల (ముఖ్యంగా ప్రతాపరుద్రుడి కాలంలో) కాలంలో నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతారు. అయితే, ముస్లిం రాజుల దండయాత్రలతో ఈ ఆలయం కొంతకాలం అసంపూర్తిగా మిగిలిపోయింది. దాడుల నుంచి రక్షించుకోవడానికి దీని చుట్టూ కోట (ఖిల్లా) లాంటి గోడలు ఉండటం వల్ల దీనికి 'ఖిల్లా రామాలయం' అని పేరు వచ్చింది.

**ఎలా వెళ్లాలి:** హైదరాబాద్ నుంచి 160 కి.మీ. దూరం. బస్సు లేదా సొంత వాహనంలో నిజామాబాద్ వెళ్లే దారిలో డిచ్‌పల్లి వద్ద దిగాలి. డిచ్‌పల్లిలో రైల్వే స్టేషన్ ఉంది. నిజామాబాద్ రైల్వే స్టేషన్ నుంచి కూడా ఆటోల ద్వారా సులభంగా చేరుకోవచ్చు.



# సంకట మోచనుడు కొండగట్టు అంజన్న

కొండల నడుమ కొలువుదీరిన కొండగట్టు అంజన్న.. భక్తుల కష్టాలను కడతేర్చే సంకట మోచనుడిగా, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ఈ క్షేత్రం ప్రసిద్ధి. అంజనేయ స్వామి స్వయంభూగా వెలసిన ఈ పవిత్ర గిరి, కోట్లాది మంది భక్తుల నమ్మకానికి ప్రతిరూపం.

**ఎక్కడ ఉంది:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామ సమీపంలో ఉంది.

**ప్రత్యేకత:** ఇక్కడ స్వామివారు స్వయంభూగా వెలిశారు. విగ్రహం ఒక వైపు నరసింహ స్వామి ముఖం, మరోవైపు ఆంజనేయ స్వామి ముఖంతో ఉండటం ఇక్కడి విశిష్టత. అంటే ఒకే విగ్రహంలో నరసింహ, హనుమత్ రూపాలు కనిపిస్తాయి.

**చరిత్ర:** త్రేతాయుగంలో లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు.. హనుమంతుడు సంజీవని పర్వతాన్ని తీసుకెళ్తుండగా.. అందులోని ఒక భాగం ఇక్కడ పడిందని.. అందుకే ఈ కొండకు అంతటి మహిమ ఉందని భక్తుల నమ్మకం.

**ఎలా వెళ్లాలి:** హైదరాబాద్ నుంచి కరీంనగర్ మీదుగా జగిత్యాల వెళ్లే బస్సులన్నీ కొండగట్టు మీదుగానే వెళ్తాయి. కరీంనగర్, జగిత్యాల బస్టాండ్ల నుంచి బస్సులు ఉంటాయి.